# లక్ష్మి వుత్తరం

ఇంక మీ మొహాన్ని యీ జన్మానికి చూడననుకుంటే; మీరు మన సల్లాపాలూ, ప్రేమా, అన్నీ మరిచిపోతారనుకుంటే, కొద్దిరోజుల్లో మళ్ళీ పెళ్ళి చేసుకుని, నన్ను పిలిచిన ముద్దు పేర్లన్నిటితోనూ ఇంకెవర్నో పిలిచి, నా బుగ్గమీద వేళ్ళేసేట్టే అట్లానే దానిబుగ్గమీద వేసి లాలిస్తారనుకుంటే; యెంతో బాధ కలుగుతుంది. వారంరోజులనుంచి ఆలోచించుకుని ఆలోచించుకుని యీబాధంతా రాత్రింబవళ్లు మనసులో అనుభవించి ఆలోచించి చివరికి తప్పనిసరిగా మీకు రాస్తున్నాను.

నేను యీరాత్రి చచ్చిపోవాడానికి నిశ్చయించుకున్నాను. మీకోసం, నాకోసం, అందరి క్షేమంకోసం ఆలోచించే నిశ్చయించుకున్నాను. నాకోసం అట్టే దుఃఖించకండి. ఈ వుత్తరమంతా చదివినప్పుడు, నాచావు మీకుకొంత శాంతినికూడాకలిగిస్తుందేమో! కాని జాలన్నాపడరూ?పడతారా మీ హృదయం నాకు తెలుసు. నాకు తెలీకపోతే యింకెవరికి తెలుస్తుంది? నా ప్రేమని మాత్రం-నిశ్చలమైన నా ప్రేమనిమాత్రం-సందేహించకండి. అది నేను సహించలేను. సందేహించలేదని మీరు వుత్తరం రాసి, నన్ను ఆపుతారని భయం. మీ ధర్మం అనుకుని ఆపుతారు. కాని, జాలిపడి క్షమించానంటారు. గాని, మీరు భరించలేరని నాకు తెలుసు. మీ హృదయం నాకు తెలీదూ? తరువాత మనిద్దరి జీవితం దుర్భరమౌతుంది. నాకే మీమీద అంత ప్రేమ లేకపోతే, మీకే నామీద అంత కాంక్ష లేకపోతే లోకంలో అందరిమల్లే వుంటే మనమున్నూ-యెట్లాగో కావరంచేసే వాళ్ళవేం.....యీ వని జరిగింతరవాతకూడా.....కాని అంత గాఢమైన నిర్మలమైన ప్రేమలో కొంచెం అనృతదోషం, కొంచెం అపవిత్రదోషం, అనుమానదోషం తగిలినా అంతా విషంగా పరిణమిస్తుంది. వీల్లేదు. చావుతోనే పరిహారం చెయ్యాలి. ఈ అక్రమాన్ని. విధి మమ్మల్నీ, నన్నూ, మన ప్రేమనీ మింగి, నాశనంచేసి.... ఇద్దర్నీ ఆరుసంత్సరాలు, సుందరమైన సంవత్సరాలు, కలిపి మధురబంధనాలతో కట్టి, యేకంచేసి, క్రూరంగా నవ్వుతో, హృదయం లేకండా ఒక్క నిమిషంలో చీల్చి, విడతీసి, చెరోమూలా ఈ అనంత ప్రపంచ వైశాల్యంలో యెక్కడో-యింక ఒకరికి ఒకరం అందకండా-యెంత యేడ్చినా, యెంత చేతులు జాచి వెతికినా లాభంలేకండా-పారేస్తోంది!.... రేపెక్కడ కళ్ళు తెరుస్తానో!....ఒకవేళ నా ఆత్మ మీ దగ్గిరికి రాగలిగితే వొచ్చినట్లు మీకు తెలియజేయగలిగితే, ఈ వుత్తరం చదివేప్పుడు మీ దగ్గిర వుండగలిగితే...మీ విచారం చూడగలనా? నేను దగ్గిరే వున్నానని తెలపగలనా?.....

నా ప్రేమని మీరు సందేహించవద్దు. మీ దగ్గిరికివొచ్చి, ఒక్కసారి, ఒక్క నిమిషం, నా ప్రేమతో, కన్నీళ్ళతో, ప్రమాణాలతో నా హృదయమంతా మీదేనని, నాదేహం మలినమైనా, నా ప్రేమ నిర్మలమని తెలియచేయాలని యెంతోవుంది. ఒక్కసారి మళ్ళీ మీ నవ్వే మొహాన్ని

చూడాలని, నావేపు కొంటెగా, మోహంతో చూసే మీ చూపు ననుభవించాలని, ప్రేమతో ఒక్కసారి పిలిపించుకోవాలని వుంది. యెట్లా? నిజమండీ. ఒక్కనిమిషం కలలోనన్నా, మనసులోనన్నా ఇంకెవరినీ కోరలేదు. యెప్పుడూ-మొదట నన్ను మీరు చూడ్డానికి వొచ్చిన నాటినించీ కూడా-నా ఆలోచనలు-కోర్కెలు అన్నీ మీమీదనే. మీరు నమ్మరూ? చచ్చిపోతున్నాగా!- యిప్పుడు నిజం చెప్పడానికింకేం? అవాళ సుబ్బారావు విషయమై, మీరు అనుమానపడ్డారుకదూ? నిర్మలమైన మీ కళ్ళలో ఆ స్వల్ప మాలిన్యమే చెప్పింది నాకు. కాని మీరు వొప్పుకోలేదు. నిజమండీ, ఆ సుబ్బారావు నాకేం లెఖ్ఖ! అందమైనవాడని తెలుసు. అందమైన వాణ్నని అతనికి తెలిసి, స్త్రీలందరూ తనని వొలిచి వొళ్ళోపడతారన్నట్టు చూస్తాడు. నావంకా అట్లానే చూశాడు. మీరంత ఆప్యాయంగా అతని పరిచయం నాకుచేస్తే అట్లాంటి భావంతో అతనుచూస్తే నాకెంతో డోకొచ్చింది? మీరు నమ్మరుకాదు! అతను ఆ వెంకటాచలంగారి కథ చదువుతోంటే, ఆ కథలో ప్రేమ, నా ప్రేమవలెవుంటే జ్ఞాపకంలేదూ-మెడకింద చెయ్యేసి ముఖం పైకెత్తడం మనమల్లేనే! ఇంకా పోనీండి ఇప్పుడెందుకు?-అందుకని శ్రద్ధతో కళ్ళతనిమీదనే పెట్టుకుని వినివుంటాను. కాని ఆ సుబ్బారావుమీద మనసనుకున్నారు నాకు! ఇప్పుడన్నా నమ్ముతారా?....యెన్నో అనుకున్నాను. మీకు ప్రమోషన్ కాగానే, మనం ఆ చిన్న డాబాయిల్లు అద్దెకి తీసుకోడం, వీధివేపు గదిలో మన మంచమూ, అద్దమూ, పెట్టుకోడమూ, రాత్రి మీరు క్లబ్బునించి వొచ్చేప్పటికి నేను....ఎందుకులెండి అవన్నీ! నాకోసం అట్టే యాడవకండి.

ఆ రాత్రి మీరు రెండునెల్ల కిందట నన్ను వొదిలి బైటికి వెళ్ళారు. ఆ రాత్రి జ్ఞాపకముందా? అంతకుముందు ప్రతివారమూ మీరు వొస్తారు వొస్తారని యెదురు చూసి నిరాశచెందివున్నాను. చివరికి అనుకోకండా ఆరోజు మధ్యాహ్నంవొచ్చి, ఆరాత్రే మెయిలికివెడతానన్నారు. మీ మొహం చూస్తోవుండే సంతోషమంతా, మిమ్మల్ని మళ్ళీ నెలరోజులు వదలాలనే దుఖ్ఖంలో కలిసి మాయమైపోయింది, బాధతో లాక్కుపోయే గుండెల దడదడని అణచుకుని, మీకు పెదిమలమీద నవ్వునే కనపరిచాను.

అలిసి వొచ్చినమీరు రాత్రి మంచంమీద పడుకోగానే నిద్రపోయినారు. ఎన్నిసార్లో తలుచుకుని ఉవ్విళ్ళూరిన మీ సాన్నిధ్యాన్ని ప్రత్యక్షంగా కావిలించుకుని మహదానందంతో. మీ బుజంమీద తలపెట్టుకుని కళ్ళు మూసుకున్నాను. రాత్రంతా మీ ముఖాన్నీ. మీ పెద్ద కనుబొమ్మల్నీ, పల్చని చొక్కాకింద మీ గట్టిబుజాన్నీ సన్నని దీపపు వెలుగులో చూస్తో పడుకున్నాను. అలారం గడియారం నిమిషాల్ని వొక్కటొక్కటే చప్పుడు చేస్తోంది. దాన్నివిసిరి పగలకొడితే!.....కాని పాపం పొద్దున్నే మీ మొహంలో వుద్యోగం భయాన్ని చూడగలనా?....మీ బుజంమీద నల్లి పాకింది. దాన్ని కూడా ప్రేమించా నారాత్రి. అదికూడా మిమ్మల్ని ప్రేమించి వొచ్చినట్టే కనపడ్డది. అట్లానే ప్రేమభారంతో కళ్ళుమూసుకుని మీ బుజంమీదే నిద్రపోయినాను. నిద్రపోతున్నా రెండుగంటలైనట్టూ, మీరు లేచి వెళ్ళిపోతున్నట్టూ, నాకు

కలవచ్చి చప్పున లేచాను. కాని మీ చక్కని దేహం నా చేతులకింద పడుకునేవుంది. మెల్లిగా లేచి గడియారంలోకి చూస్తే వొంటిగంటయింది. యింకా ఒకగంట. మిమ్మల్ని గట్టిగా ముద్దుపెట్టుకుంటే, మీ రొమ్ముమీద నా తలని అదుముకుంటే, మీకు మెళుకువ వొచ్చి, అప్పుడే ప్రయాణానికి సిద్ధమౌతారని భయం-కదలకుండా మీ గుండ్రని గడ్డంకేసి కోల చెంపలకేసి నున్ననిగోళ్ళలో కొనలుతేలే వేళ్ళకేసి, చూస్తున్నాను. మళ్ళీ కునుకుపట్టడమూ, అలారం కొడుతున్న చప్పుడైనట్టే మెళుకువ రావడమూ మిమ్మల్ని చిన్న చిన్న తేలిక ముద్దులు పెట్టుకోడమూ, గడియారం వంక చూడడముతో గడిచింది ఆ కాస్త కాలమూ. టంగ్ టంగ్‌మన్నట్లు అనుకుని  అనుకుని, భయపడి గుండెలు దడదడ కొట్టుకున్నాయి. ఆ బాధ భరించలేక మిమ్మల్ని లేపి పంపెయ్యాలనిపించింది.

నిద్రకళ్ళతో నన్ను కడసారి చూసి వెళ్ళిపోయినారు. బండి వెడుతోవుంటే నేనుకూడా మీతో వొస్తోవుంటే యెంత బావుండేది అనుకుని ఆశపడ్డాను. కిటికీలోంచి తొంగిచూశాను. దీపం వెలుతురులో మీకాలు చివర మాత్రం కనపడ్డది. అదే ఆఖరుసారి మిమ్మల్ని చూడడం మన జన్మానికి. మీనించి విరహం భరించలేక, మీరు పడుకున్నచోటే, కొంచం సిగరెట్టు వాసనవేసే ఆ పక్కమీద. మీవంక తిరిగి మీరున్నట్టుగా భావించుకుంటో పడుకున్నాను. మీరున్నట్టే అయింది, మీ చేతులు నా చుట్టూ వున్నట్టే, మిమ్మల్ని అనుకున్నట్టే అనుకున్నాను...

యెంత సేపయింది. కలలో మీరు తిరిగివొచ్చి నన్ను ముద్దు పెట్టుకున్నట్లు తోచింది. మెళకువ వచ్చింది. కొంచెంగా నన్ను కావలించుకుని యెదురుగా వున్నారనుకున్నాను. యింకా కలా! ఆనందంతో సుఖానుభవంలో, నా దేహం మూర్ఛపోతోంది. యెంతో శాంతి వొచ్చింది నా నరాలకి.

"మళ్ళీ వొచ్చారేం?"

మాట్టాడలేదు. ప్రేమతో నా చేతులు మెడచుట్టూ వేసి దగ్గిరికి యింకా అదుము -కున్నాను. చంపలమీద చేతులు వేశాను? మీసాలు లేవు. యెవరిది? వొదిలించుకో -బోయినాను. పెనుగులాడాలనుకున్నాను. కాని నా నరాలు నాకెదురు తిరిగాయి. నా శరీరమే నాకే తిరగబడి ద్రోహం చేసింది. మీరు మోహంతో నన్నుద్రేకింపచేసి, తృప్తిపరచక, వొదిలిన నిరాశవల్ల నాదేహం యెంత ప్రయత్నించినా కదలలేదు. స్వాధీనం తప్పింది. నాభర్త నా ప్రేమ! అంటాను, అరుచుకుంటాను. మూడు నెల్లనించి మిమ్మల్ని తలుచుకుంటో అణచిపెట్టిన మోహతీవ్రత, మీరా రాత్రి సంతృప్తిపరచని ఆవేదన, అంతా నన్ను ముంచేసి, దాసురాల్ని చేసి, నా నిశ్చయశక్తిని నోరునొక్కి నన్నిట్లాచేసింది.......వాడు, మీ పరమాప్తు....పోనీలెండి వాడెవరేమైతేనేం? యెందుకు?

ఆరోజునించి జాగ్రత్తగా వున్నాను, తలుపు గడియ వేసుకుంటున్నాను. వెంటనే మీ దగ్గిరికి వొచ్చి మీతో అంతా చెప్పేసి, మీ కాళ్ళమీద పడి యేడిస్తే, మీరు కరుణిస్తారేమోనని

ఆశపుట్టింది. మీ దగ్గరికి వస్తానని కూడా రాశాను, జ్ఞాపకముందీ? కాని వూరినించి వూరికి తిరుగుతో మీరు వీల్లేదన్నారు. మీకీ సంగతి రాయాలా కూడదా అని సందేహం పట్టుకుంది. చెపితే నన్ను వొదిలేస్తారా? అప్పుడు నేనెట్లా బతకను? అనుకున్నాను. అందుకనే మీకు రాశాను కూడాను. జ్ఞాపకముందీ? "ఒకావిడ యింకోడితో సంబంధం పెట్టుకుని తరవాత పశ్చాత్తాపపడ్డది. భర్త వొదిలెయ్యాలా; కూడదా! యేది ధర్మం? మీ అభిప్రాయమేమిటి?" అని. మీ జవాబు చదివితే మీరు క్షమార్పణ చూపేటట్టు కనబడలేదు. మీరు విపరీతమైన బాధపడతారని తెలుసు. తెలిస్తే! మీరు నన్ను వొంటిమీద ముద్దుపెట్టుకుంటో "యిదంతా నాదేకదూ! ఇంకోరు తాకితే భరించలేను!" అన్నప్పటి ఈర్ష్యతో నిండిన మీ చూపులు జ్ఞాపకమొచ్చాయి. ఆలోచించి, ఆలోచించి, మీతో చెప్పకూడదనుకున్నాను. "యెందుకు చెప్పడం? యేం లాభం చెప్పి? ఇంక మూణ్ణెల్లలో యిద్దరం ఎప్పుడూ కలిసే వుంటాం. మీకు ప్రమోషన్ కాగానే! యింక వాడేమీ చేస్తాడు? అనుకున్నాను. కాని నా అదృష్టం యిట్టా పరిణమించింది. నా ఆశలన్నీ సంతోషమంతా యిట్లా బుగ్గిలో కలిశాయి. నెలరోజులు కిందటే మొదటి అనుమానం కలిగింది నిజమోనేమో అని భయంతో గిజగిజలాడాను. యేదో వొకటి తేలిందాకా రోజురోజు యెట్లా గడిపానని! ప్రతిరోజూ యెదురుచూస్తో, తప్పు లెక్క పెట్టానేమోనని కొన్నాళ్ళూ, ఆలస్యానికి కారణం కల్పించకుంటో కొన్నాళ్లూ ఆశలేని ఆశతో గడిపాను. కాని మెల్లిగా సిర్థపడ్డది. ఇంక మీతో బొంకేదెట్లా? యెన్నడూలేనిది ఇప్పుడే యిది రావాలీ? పోనీ యెట్లానన్నా మిమ్మల్ని మోసపుచ్చి మీతోవుండే విధమే వుండకూడదూ?

మా వాళ్ళకి తెలిసింది. మీకు సంతోషంగా వుత్తరం రాశారు ఈ రోజు. ఆ వుత్తరం తరవాత ఇది అందితే మీ మనసు యెట్లా వుంటుంది? ఈపాటికే నన్ను సందేహిస్తో వుంటారు మీరు. ఈ వుత్తరం అందేటప్పటికే! పోనీ బతికేవుందామా అనుకుంటా! చచ్చిపోతున్నాను గనక నేను రాసిన యీ సంగతులు నమ్ముతారేమో గాని, బతికివుండి మీతో చెప్పితే నమ్ముతారా? నేనేదో కావలసి చేసి, యీ పన్నాగం పన్నాననుకుంటారు. వీల్లేదు. నీళ్ళల్లోపడతా నీరాత్రే. శెలవుమరి. ఇంక మళ్ళీ మీ మొహం చూడను. వొచ్చే జన్మంలో మీరెవరో, నేనెవరో! యీ చివర నిమిషాలలో మీతో గడిపిన అదృష్టపు దినాలూ, అమూల్య కాలమూ అంతా జ్ఞాపకమొస్తోంది, ఆరోజు తెల్లారకట్ట వొద్దులెండి. యెందుకదంతా ఇప్పుడు?- మళ్ళీ పెళ్ళి చేసుకుంటారా?.....

◆ ◆ ◆

*ప్రచురణ : (కర్మమిట్లాకాలింది కథల సంపుటి) స్టూడెంట్స్ బుక్ సెంటర్, 1958*